

కథా కౌముది

పిచ్చిది

కి.రాజనారాయణన్

తమిళం నుంచి అనువాదం: అవినేని భాస్కర్

పేచ్చి ఒక తీయనైన కల కన్నది. రెండు తలుపులున్న గుమ్మం, అందులో ఒక తలుపు తెరిచి, మఱో తలుపు మూసి ఉన్నాయి. మూసి ఉన్న తలుపు రెక్కను పట్టుకున్న పసి వేళ్ళు మాత్రమే కనిపిస్తున్నాయి. ఒక చిన్న బిడ్డ తల మెల్లగా తొంగి చూసి క్షణంలో దాక్కుంది. మళ్ళీ మెల్లగా చూసింది. చూడగానే నవ్వుతూ చప్పున తల వెనక్కి తీసుకుంది. మళ్ళీ మెల్లగా...

పార్వతి అమ్మవారి గుడి ముందున్న వేపచెట్టు కింద పడుకుంది పేచ్చి. పండు వెన్నెల కాస్తోంది. ఆమెను చుట్టు ముట్టి ఊపేస్తున్నట్లుగా పడమటి గాలి విసురుగా వీస్తోంది. చేతులు బార్లా చాచుకుని, వెల్లకిలా నేల మీద పడి గాఢనిద్రలో ఉంది. రవిక లేని ఆ పైట కొంగు పొట్టమీద పడి ఉంది. మొత్తం చీరంతా కూడా చెదిరిపోయి అస్తవ్యస్తంగా ఉంది.

ఆమె నడుం వాల్చినప్పుడు ఉన్న వేప చెట్టు నీడ ఇప్పుడు పక్కకు తప్పుకుని, వెన్నెల వెలుగు నేరుగా ఆమె మీద పడుతోంది. ముఖం మీద మాత్రం దట్టమైన బంతిలాంటి ఒక కొమ్మ నీడ పడుతూ, గాలికి అది కదులుతూ వెన్నెల ఆమె ముఖం మీద దోబూచులాడుతున్న ఆ సమయంలోనే పైన చెప్పిన కలను కంటోంది పేచ్చి.

కల కొనసాగుతోంది. ఆమె ఆ బిడ్డను పట్టుకోవాలని ముందుకు అడుగేసింది. బిడ్డ మాయమైంది. ఆమె పరాగ్గా ఉన్నప్పుడు బిడ్డ వెనక నుండి వచ్చి ఆమె చీరను పట్టుకుని లాగింది. పట్టుకుందామని వెనక్కి తిరిగితే బిడ్డ మాయమైపోతోంది. హఠాత్తుగా పేచ్చి ఆ బిడ్డను ఒడిసి పట్టుకుంది. గాఢంగా హత్తుకుని బిడ్డ ముఖమంతా

గబగబా ముద్దులు కురిపించింది. బిడ్డ తప్పించుకుని పారిపోవాలని గిజగిజలాడుతోంది. పైట లేని ఆ పెద్ద రొమ్ములో ఆ గింజులాట చెప్పనలవికాని పెనుసుఖంలా ఒళ్ళు పులకించిపోయింది ఆమెకు.

ఇప్పుడు ఆమె కల చెదిరి సగం మెలకువలోకి వచ్చేస్తోంది. తాను హత్తుకున్న బిడ్డ మోయలేనంత బరువుగా అనిపించడంతో, తాను కన్నది కల కాదని, నీడకోసం పడుకున్న చెట్టే తన మీదకు ఒరిగిపోయి అదిమేస్తోందని అనుకుంది. పొత్తికడుపు మీద అదిమేస్తూ, గుండె మీద పడి ఉన్న ఆ చెట్టును పట్టుకున్న తన రెండు చేతులు వదిలేసి, ప్రాణం కాపాడుకోవాలన్న ఆరాటంలో ఆమె గొంతునుండి భయంకరమైన కేక బయటకు వచ్చింది. ఆ కేక వేసిన క్షణమే ఆమెకు మెలకువ వచ్చింది. అప్పుడు దూరంగా ఎవరో ఒక మనిషి పరిగెత్తుకెళ్తున్నట్లు కనిపించింది.

★★★

ఈ పడమటి దేశాన పత్తి కోతకు వచ్చే కాలంలో మాత్రమే పత్తి తెంపడానికి వచ్చే వలస కూలీల్లో పేచ్చి కూడా ఒకత్తె. ఆ దశలో ఆ గ్రామానికి వందలాది మంది ఆడవాళ్ళు కూలీలుగా వలస వస్తారు. వాళ్ళలో కొందరు రైతుల గొడ్ల కొట్టాల్లో, చావిట్లో ఉంటూ, అక్కడే గంజికాచుకుని తాగి తలదాచుకుంటారు. చోటు దొరకని వాళ్ళు ఊర్లోని రచ్చలమీదో, గుడి దగ్గరున్న చెట్లకిందే తలదాచుకుంటారు. కూలీగా ఇచ్చిన పత్తిని గోనెసంచీల్లో మూటగట్టి పొలంయజమానుల ఇళ్ళల్లోనే దాచి పెడతారు. ఏ రోజుకారోజు కావాల్సినంత పత్తిని అమ్ముకుని, వచ్చిన డబ్బుతో చిలకడదుంపలు, అనుములు (అనప పప్పు, అవరెకాళు), తాటిబెల్లం కొనుక్కుని తింటారు. వాళ్ళకు మూడు పాటలా ప్రధాన ఆహారం దుంపలే.

వాళ్ళు స్నానం చేయడం ఎవరూ చూడలేదు. ఎండనబడి పత్తి తెంపడం ముగిశాక, వీధుల్లో నిలబడి పైట కొంగును మాత్రం విప్పి నడుముకు చుట్టుకుని కొంచెం నీళ్ళతో ముఖం, చేతులు, వీపు, చాతి, చంకల భాగాల్ను మాత్రమే కడుక్కుంటారు. గిన్నెలో ఇంకా నీళ్ళు మిగిలి ఉంటే పాదాల్ను కూడా తడుపుకుంటారు.

రేకు డబ్బాలో తెచ్చుకున్న ఆముదాన్ని తలకు రాసుకుంటారు. వీధుల్లో వెళ్తుంటే వాళ్ళ దగ్గరనుండి ఒక రకమైన దుర్వాసన కొడుతూ ఉంటుంది. ముఖికి పట్టేసి రేగిపోయిన పొట్టి జుట్టు, చేతులకు ఘనమైన వెండి కడియాలు, చెవులకు వెండి లేదా ఇత్తడి కమ్మలు, గార పట్టిన పసుపు రంగు పళ్ళు, కొట్టొచ్చినట్టుండే ముదురు రంగు చీరలు, సాగదీస్తూ మాట్లాడే తమిళం – ఇదీ వీళ్ళ వ్యవహారం.

పేచ్చిని వాళ్ళోళ్ళుకూడా 'ఓయ్ పిచ్చి గాడిదా' అనే పిలుస్తారు. ఆమెది ఒకలాంటి వింత స్వభావం. చిందరవందరకు కూడా చిరాకెత్తించేట్టుండే జుట్టు, పెదాల కొసల్లో దూసుకొస్తున్నట్టు కనిపించే కోర పళ్ళు, నిద్రలో కారి ఎండిపోయున్న చొంగ చారల ముఖం. పుసులు కట్టేసి, పీక్కుపోయినట్టుండే కళ్ళు, దట్టమైన కనుబొమ్మలు, వానలో తడిసిన తాడి చట్టులాంటి నల్లటి మేని ఛాయ. మఱకలు మఱకలుగా ముఱికిపేరుకున్న ఒళ్ళు. తెల్లగా పొరలెక్కిన కాళ్ళు – వంగి మూత్రం పోయడంవల్ల కాళ్ళమీద చెదిరిపడే తుంపర్ల చుక్కలు. పాతబడిన ఎరుపురంగు చీర. ఇన్ని వికారాల మధ్య కూడా ప్రకృతి ఆమె శరీరానికి ఒక నిగ్గునిచ్చిందనే చెప్పాలి. గుళ్ళల్లో ఉండే దేవతా శిల్పాలను తలదన్నే అప్సరసలాంటి సౌష్టవమైన స్తనాలున్నాయి ఆమెకు.

★★★

పేచ్చి కొన్ని రోజులుగా పత్తి తెంపడానికి సరిగ్గా వెళ్ళడం లేదు. రాత్రుళ్ళో ఆ చెట్టుకింద చీకటిగా ఉన్నచోటున ఒంటరిగా కూర్చుని దేనికోసమో ఎదురుచూస్తున్నట్లు కనిపిస్తుంది. ఒక్కోసారి పట్టలేని సంతోషంతో ఏడుస్తున్నట్టుగాను, తాళలేని దుఃఖంతో పిచ్చిగా నవ్వుతున్నట్టూ ప్రవర్తిస్తోంది. మళ్ళీ మళ్ళీ అదే వేపచెట్టుకిందకుపోయి చొంగ కార్చుకుంటూ వికారంగా పడుకుని తుమ్మమొద్దులా పడి నిద్రపోతుంది. కానీ, ఆ తర్వాత ఆమెకు ఎప్పుడూ ఆ కల మాత్రం రాలేదు.

అది జరిగిన మూడు నెల్లకి ఒకరోజు పత్తిచేళ్ళో పేచ్చి వాంతులు చేసుకుంది. అక్కడున్న ఆడవాళ్ళు ఆమెకు వేవిళ్ళు అని ఏడిపించారు. వాళ్ళలో ఎవత్తె నాలుక నల్ల నాలుకోగానీ, ఆ ఆటపట్టింపు పలించింది! పేచ్చికి నిజంగానే వేవిళ్ళు. ముఖంలో పిచ్చివాళ్ళకుండే ఆ వికార రూపంపోయి, కొత్త నిగ్గు వచ్చిచేరింది.

పేచ్చి ఇప్పటి వరకు పెళ్ళికాకుండా, కన్యగానే ఉండేది. ఈ కడుపొచ్చిన సంగతి ఊరంతా దావానలంలా పాకింది. పలుగురు ఈ వార్తను నమ్మడానికి సిద్ధంగాలేరు. ముఖ్యంగా ఆ ఊర్లోని కన్నెపిల్లలు ఈ వార్త విని భయపడిపోయారు. విషయం పేచ్చి వాళ్ళ ఊరికి అందింది. ఆమె బంధువర్గంనుండి కొందరు మగవాళ్ళు వచ్చారు. ఆమెను చితకబాదారు.

'ఎవరో చెప్పు, చెప్పు!' అని వాళ్ళు ఆమెను తన్నారు. భరించలేని దెబ్బలు ఒంటిమీద పడినప్పుడు మాత్రం, ఆమె నిద్రలోనుండి ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచినట్లు తన చుట్టూ ఉన్నవాళ్ళని చూసి, 'ఏంది?' అని మాత్రమే అడిగేది. కొన్నిసార్లు ఆ దెబ్బలు తట్టుకోలేక, 'నాకేం దెలీదు... నిజ్జింగా నాకేం దెలీదు. అయ్యో దేఁవుడా, నాకేం దెలీదు... దెలీదు' అని కీచుగొంతుతో కేకలుపెడుతూ ఏడ్చేది.

ఊరినుండి వచ్చిన బంధువులకి ఆమె చేసిన పని భరించలేని అవమానంగా అనిపించింది. వాళ్ళు తమ శక్తినంతా కూడబలుక్కుని ఆమెను కొట్టి చిత్రహింసలు పెట్టారు. చాలాసార్లు ఆమె స్పృహతప్పి పడిపోయింది. అయినప్పటికీ, వాళ్ళు ఆమెనుండి ఏ విషయాన్నీ తెలుసుకోలేకపోయారు. వాళ్ళు ఓడిపోయారు. వచ్చిన వాళ్ళలో ఉన్న ఆమె ఇద్దరు అన్నయ్యలు మాత్రం తమ చంపలమీద తామే ఆత్రంగా కొట్టుకుంటూ, రెండు చేతుల్తో తల పట్టుకుని అక్కడే కూర్చుని ఏడ్చారు. వాళ్ళ ఆడవాళ్ళు ఆమెను తిట్టిన తిట్లకు లెక్కే లేదు. ఒకామె చివరగా, "ఈ ముండను ముక్కలు ముక్కలుగా నరికేసినా మన్ను ఆరదు" అంది. ఇంకోకామె, "ఒక గుంత తొవ్వండి. దీన్ని ఇక్కడే ప్రాణాల్తో పూడ్చేసి పూడద్దాం!" అంది.

ఊర్లో ప్రతిరోజూ పొద్దున పూటా, రాత్రి పూటా రైతుల ఇళ్ళకు అన్నం కోసం వచ్చే పనిపిల్లా, చాకలామె దీని గురించే ఆ ఇంటి ఆడవాళ్ళతో గంటల తరబడి నిలబడి, ముక్కు మీద వేలేసుకుని 'ఇట్ల గూడా యాడైనా జరుగుతుందా?' అని ఆశ్చర్యపోతూ, పేచ్చి గురించి తమకు తెలిసిన విషయాలకు మఱికొంత వాళ్ళ సొంత కల్పనను జోడించి ముచ్చట్లు చెప్పేవాళ్ళు. అన్నం గిన్నెను చంకన పెట్టుకుని పనిపిల్ల కాళి, "అమ్మా! ఇంక మీద ఎండాకాలంలో సిన్నపిల్లలు బయట వాకిట్లో పడుకోని నిదరపోయే రోజులు పోయినాయి తల్లా! జరగతా ఉండే అగాయిత్తాలు సూస్తా ఉంటే బూమ్మీద నేయఁవే లేదునుకో" అని అంది.

"నాకు ఇన్నేండ్లు వొచ్చినేయిగానీ ఇట్టాంటి అన్నేయం జరగడం నా కళ్ళతో ఎప్పుడూ సూళ్ళేదు తల్లా."

"ఏం జేస్తాం? పేచ్చిగూడ మన్లాంటి ఆఁడదే గాదా! పాపిష్టిది" అని ఆవేశంగా అంటూ, కళ్ళలో పొంగుతున్న నీళ్ళను తుడుచుకోకుండానే పక్కున నవ్వి,

"అవున్లే... అయినా ఒక ఆఁడదానికి 'ఇది' కూడా తెలియకుండా పోయిందా?" అని అడుగుతూ మఱింత గట్టిగా నవ్వింది. అదే సమయానికి ఆ ఇంటికే అన్నం తీసుకోవడానికి చాకలి సుడలి చేతిలో తాటి బుట్టతో వచ్చింది. వచ్చిన ఆమె కాళి చెప్పిన చివరి మాటలు విని, "ఏదెట్టా తెలికుండా పోతాది? ఒక ఆఁడదానికి అంత మొద్దు నిద్ర ఎట్టా పడుతుంది! అదొక దొంగ ముండలే, దానికి పిచ్చిలేదు, పాడూ లేదు. పిచ్చిదాన్లా ఏసాలేస్తా ఉండాది..."

కానీ కాళికి, మిగిలిన వాళ్ళకి ఆ మాట నమ్మబుద్ధి కాలేదు.

"ఎవురో మోసం జేసేసుంటారు, అంతే సంగతి" అని వాళ్ళు నిర్ధారించేశారు. అయితే వాళ్ళకు ఆ విషయాన్ని తలచుకున్నప్పుడల్లా కడుపులో ఒక రకమైన భయం కలిగేది.

★★★

ఆ ఏడాది శ్రావణ మాసంలో పడమటి గాలి ఎక్కువగా వీచడం వల్ల పత్తి తొందరగానే ఎండిపోయింది. తెంపడం కూడా తొందగా ముగిసింది. వలస వచ్చిన ఆడవాళ్ళందరూ వెళ్ళిపోయారు కానీ పేచ్చి మాత్రం వాళ్ళతో వెళ్ళను అని చెప్పి అక్కడే ఉండిపోయింది.

నెలలు గడిచే కొద్ది ఆమె పొట్ట పెద్దదవుతూ వచ్చింది. ఊర్లో కొన్ని ఇళ్ళల్లో ఆరికలు, ఊదర్లు దంచిచ్చివ్వండం, గొడ్ల చావిట్లో పనులు వంటివి చేసి పెట్టి వాళ్ళ పోసే గంజి తాగి పొట్టబోసుకుంటోంది.

ఏ పనీ లేని రోజుల్లో కొందరు ఆడవాళ్ళు అయ్యో పాపం ఒట్టి మనిషి కాదు, కడుపుతో ఉంది అన్న జాలితో కూటినీళ్ళు ఇచ్చేవాళ్ళు. అప్పటివరుకు పేచ్చిని తిట్టి అవహేళన చేసివాళ్ళుకూడా ముందుకు ఉబ్బిన పొట్టను చూసి జాలి పడి సహాయాలు చేశారు.

పురుడు పోసుకునే సమయం దగ్గరకు వచ్చింది. ఆడవాళ్ళు కొందరు వెంగా నాయకర్ వాళ్ళ పశువుల కొట్టంలో ఒక మూలన పేచ్చి ప్రసవానికి ఏర్పాటు చేసిచ్చారు. ఒక రకంగా సంతోషం, ఒక రకంగా జాలి వాళ్ళకు. ఇలా ఊరంతా కలిసి వచ్చి ఇప్పటివరకు ఎవరికీ పురుడు పోయలేదు. నడిపింటి రంగమ్మ తన ప్రసవ సమయంలో కొట్టి పెట్టుకున్న మందు ఉండలు తెచ్చి ఇచ్చింది. చాకలి నవరత్నమ్మ పాత బట్టలు తెచ్చి ఇచ్చింది. పనిపిల్ల కాళి మంతరసాణిగా ఉండి అన్నీ చూసుకుంది.

సుఖ ప్రసవం జరిగింది.

'పిచ్చిదాని కడుపున ముత్యంలాంటి మగబిడ్డ పుట్టాడే' అని ముక్కుమీద వేలేసుకోని వాళ్ళు లేరు. వాళ్ళకు తెలిసిన వాళ్ళందరి ముఖాలనూ మనసులోకి తెచ్చుకుని బిడ్డ ముఖంతో పోల్చి చూసుకున్నారు. ఏ మాత్రమూ అంతు చిక్కలేదు ఎవరికీ.

అక్కడున్న అందరూ పనిపిల్ల కాళీనే బిడ్డకు పురిటి సాంగ్యాలు చెయ్యమన్నారు.

బిడ్డను కన్న తర్వాత పేచ్చి ముఖంలో ఒక వింత మార్పొచ్చింది. ఆమెలో అదివరకున్న పిచ్చితనం పూర్తిగా వదిలిపోయినట్లు కనిపించింది.

ఆమె స్తన్యాల్లో పాలు బాగా పడ్డాయి. ఒక స్తనంలో బిడ్డ నోరు పెట్టి పాలు తాగుతున్నప్పుడే మఱో స్తనంనుండి తెల్లటి దారాల్లాగా పాలు చిమ్ముతూ ఉండేది. గాయంనుండి కారుతున్న రక్తాన్ని అదిమి పట్టినట్టు ఆమె మఱో చేత్తో ఆ స్తనాన్ని చెంగుతో అదిమి పట్టుకునేది. కలిగినవాళ్ళ ఇంటి ఆడవాళ్ళు ఇది చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనైయ్యేవాళ్ళు. పేచ్చి అంత దూరాన నడిచి వస్తుంటే కూడా పచ్చి చనుబాలవాసన ముక్కుపుటాలను అదరగొట్టేసేది.

బాగా చనుబాలు తాగి రోజు రోజుకీ బొద్దుగా అవుతున్న ఆ బిడ్డ ఆరోగ్యం వర్ణించనలవి కానిది. పేచ్చి కలలో చూసిన ఆ అందాల పసిబిడ్డలాగే తన బిడ్డ ఉన్నాడు.

పేచ్చి ఇప్పుడు, తాను పని చేసే ఇళ్ళల్లో పెట్టే తిండి చాలక, ఇంటింటికీ వెళ్ళి బిచ్చమెత్తుకుని మఱీ తింటోంది. ఏడుపు గొంతుతో మాటలు స్పష్టంగా లేని ఏదో ఒక జోలపాటను తన బిడ్డకోసం పాడుతుంటుంది పేచ్చి. పొద్దుటేళా, ప్రొద్దుగూకే వేళా వీధిలోని గోడ నీడన బిడ్డను ఒడిలో వేసుకుని కూర్చుని, అటు ఇటు వెళ్ళే కుర్రాళ్ళ ముఖాలను వాళ్ళకు తెలియకుండా తీక్షణంగా గమనిస్తూ, మళ్ళీ తన ఒడిలో ఉన్న బిడ్డ ముఖం వైపు చూస్తూ ఉండిపోయేది.

★★★

దిష్టి అన్నది నిజంగా ఉంటుందో ఏమో తెలియదు కానీ, అది పేచ్చి బిడ్డకు తగిలిందని అందరూ చెప్పుకున్నారు. అకస్మాత్తుగా ఒకరోజు 'డిఫ్తీరియా' వ్యాధి సోకి ఆ బిడ్డ చనిపోయింది. ఊర్లోవాళ్ళ మాటల్ను నమ్మడానికి ఆమె సిద్ధంగా లేదు; తన బిడ్డ బతికే ఉందని ఆమె మనస్ఫూర్తిగా నమ్మింది. ఎప్పటిలాగే ఆ బిడ్డతో గారాలు పోయింది, ముద్దాడింది, నవ్వింది. పక్కన పడుకోబెట్టుకుని, తన రెండు స్తనాల నుండి చిమ్ముతున్న చనుబాలతో ఆ బిడ్డను తడిపి ముంచెత్తుతూ, ఆ పరవశంలో కళ్ళు మూసుకుని నిద్రపోయింది.

ఆమెకు మళ్ళీ పిచ్చి పట్టిందని అందరూ చెప్పుకున్నారు. ఆమె చనిపోయిన బిడ్డను చంకన పెట్టుకుని ఇంటింటికీ వెళ్ళి బిచ్చమెత్తింది. ఈ విషయాన్ని పేచ్చి వాళ్ళ ఊరికి తెలియజేశారు. ఆమె ఊర్నుండి మనుషులొచ్చారు.

ఇప్పుడు అక్కడ కొత్త పెనుగులాట మొదలైంది. బిడ్డను పాతిడానికి ఇవ్వనంటూ పేచ్చి పరుగెత్తడం మొదలుపెట్టింది. బిడ్డ చనిపోయి అప్పటికే మూడు నాలుగు రోజులు కావడంతో బిడ్డ శరీరం ఉబ్బిపోయి, కొన్ని చోట్ల చర్మం చిట్లిపోయింది. వాళ్ళు ఆమెను చుట్టుముట్టి, అడ్డగించి, పెనుగులాడి ఆమె పట్టు నుండి బిడ్డను లాక్కున్నారు. ఆ క్రమంలో బిడ్డ చేయి కూడా కొంచెం ఊడిపోయింది. తన నుండి బిడ్డను వేరు చేయగానే ఆమె గట్టిగా కేకలు పెడుతూ, ఏడుస్తూ మూర్ఛపోయింది.

బిడ్డను పాతిపెట్టడానికి తీసుకువెళ్ళారు. మూర్ఛనుండి తేఱుకున్న పేచ్చి స్మశానానికి పరుగు తీసింది. బిడ్డను పాతిపెట్టి మట్టి వేస్తుండగా అక్కడ చేరుకుని నానా ఆర్భాటమూ చేసింది. ఆమెను గట్టిగా కొట్టి, కాళ్ళు చేతులు కట్టేసి, ఒక బండిలో వేసుకుని వాళ్ళ ఊరికి తీసుకువెళ్ళారు.

అక్కడ ఆమెను ఒక ఇంట్లో బంధించి తాళం వేసేశారు. ఆమె తిండీ నీళ్ళు ముట్టుకోలేదు. మోకాళ్ళను హత్తుకు కూర్చుని, దీనంగా ఇంటి పైకప్పు దూలాలకేసి చూస్తూ ఉండిపోయింది. అప్పుడప్పుడు మూసి ఉన్న తలుపు దగ్గరకు వెళ్ళి తలను 'ధమ్ ధమ్'మని బలంగా బాదుకునేది. "అయ్యో... నీ మొకమైనా సరిగ్గా సూడలేదురా... పాపిష్టిదాన్ని నేను..." అంటూ రొమ్ములమీద గట్టిగా బాదుకుని ఏడుస్తున్న శబ్దం వినిపించేది.

ఒకరోజు రాత్రి ఆ ఇంటి పైకప్పుకున్న పెంకుల్ను విప్పుకుని అక్కడి నుండి తప్పించుకుని పారిపోయింది.

మఱుసటి రోజు అన్ని ఊళ్ళల్లోనూ ఆమె కోసం వెతికారు, కానీ ఎవరికీ కనిపించలేదు.

ఆమె రాత్రికి రాత్రే పరుగు తీసింది. ఒంటిమీద నూలుపోగు కూడా లేదు. మంగమ్మ రహదారిని దాటుకుని వెళ్తున్నప్పుడు, చుక్క నడి ఆకాశంనుండి జారి చాలా దూరం దిగిపోయింది. రహదారి మీద వరుసగా వెళ్తున్న ఎడ్లబండ్లు, వాటి కింద కట్టిన లాంతర్ల వెలుతురుతో చూస్తుంటే, కొరివి దయ్యాలు బారులు తీరి వెళ్తున్నట్టుగా ఉంది. ఎడ్ల మెడలోని గంటల చప్పుడు, ఇరుసుల రాపిడి వల్ల వచ్చే కిఱ్ఱు శబ్దాలు, చక్రాలు కొట్టుకునే శబ్దాలు నిరంతరం వినిపిస్తూనే ఉన్నాయి. ఆ బండ్లు ఇలంజినుండి, సెంగోట్టైనుండీ మామిడి పళ్ళను వేసుకుని కోవిల్‌పట్టికి వెళ్తున్నాయి. అందులో ఒక బండివాడు విషాదకరమైన జానపద పాట పాడుకుంటూ వెళ్తున్నాడు. ఆ అర్ధరాత్రి చీకటిలో ఆ గొంతు మనసును కోసేస్తున్నట్టుగా ఉంది.

పేచ్చి నేరుగా తన బిడ్డను పాతిపెట్టిన స్మశానానికి పరుగు తీసింది. అక్కడ ఒక శవం చితిలో బాగా మంటలురేగి కాలుతోంది. ఆ వెలుతురులో తన బిడ్డను పాతిపెట్టిన చోటు వెతుక్కుని చేతుల్తోనే తవ్వింది. తవ్వి

తవ్వి బిడ్డను బయటకు తీసింది. చర్మం కుళ్ళిపోయి నీరు కారుతున్న బిడ్డ శవాన్ని రొమ్ములకు హత్తుకుని గట్టిగా నవ్వింది. అలా నవ్వుతుండగానే ఆమె కళ్ళనుండి ధారగా నీళ్ళు కారాయి.

అప్పుడు ఉన్నట్టుండి ఆమెకు తాళలేనంత ఆకలి వేసింది. నిప్పులో కాల్చిన చిలగడదుంపను తిన్నంత మామూలుగా, పక్కన చితిలో కాలుతున్న శవం నుండి ఒక భాగాన్ని కర్ర సాయంతో లాగి, వేడి తగ్గడానికి ఊదుతూ, పళ్ళతో కొరికి ఆ కాలిన మాంసాన్ని ఆబగా తినింది. తన బిడ్డతోను, తనతో తానూ ఏదో మాట్లాడుకుంటూనే తినింది.

★★★

ఊరంతా గాఢ నిద్రలో ఉంది. పడమటి దిక్కునుండి విరుచుకుపడుతున్నట్టు భయంకరమైన సుడిగాలి అలలు అలలుగా అత్యంతవేగంగా వీస్తోంది. మిగతా కాలాల్లో ఇంతటి గాలి ఎక్కడ దాక్కుంటుందో అని గ్రామస్తులు అనుకుంటూ ఉంటారు. వైశాఖం మొదలైనప్పటినుండి ఆశ్వయుజం వచ్చేంత వరకు దయ్యం పూనినట్టు పడమటి విసురుగాలి ఆట కొనసాగుతుంది. నదిలోని నీటి ప్రవాహం ఎక్కువుండే చోటే జీవించే చేపల్లాగా, ఈ రేగడిభూముల్లో జీవించే రైతులు గాలి సుడిగుండాల మధ్యే బతుకుతారు. ఆ గాలి పగలు రాత్రి తేడా లేకుండా చెట్లు పుట్లని తేడాలేకుండా ఇక్కడున్న అన్నట్నీ రాసుకుంటూ ప్రతిక్షణమూ తన రాకను భీకరమైన శబ్దంతో గట్టిగా తెలియజేస్తూ ఈ ప్రాంతాన్ని దాటుకుని పోతుంది. పశ్చిమ కొండలవరుసలో ఒక పెద్ద కనుమ ఉంది. అక్కడ ఎవరి కంటికీ కనిపించని బ్రహ్మాండమైన రాక్షస తలుపు ఒకటి మూసి ఉంటుంది. వైశాఖం మొదలవ్వగానే ఎవరో దాన్ని తెరిచి వదులేస్తారు! సముద్రం అడ్డుకట్ట తెంచుకున్నట్టుగా గాలి 'హో' అని హోరుపెడుతూ ఒక నదిలా ఈ ప్రాంతాన్ని ముంచెత్తుతుంది. మెల్లమెల్లగా ఆ ప్రాంతంలోని మనుషులు, ఇళ్ళు, గడ్డివాములు, చెట్లు అన్నీ ఆ గాలి ప్రవాహంలో మునిగిపోతాయి. వాటన్నిటినీ ముంచెత్తుతూ తూర్పుదిశగా వేగంగా పరుగు తీస్తుంది.

గాఢ నిద్రలో ఉన్నవాళ్ళను ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురిచేసే ఒక దుర్వాసన ఆ గ్రామస్తులను ఉలిక్కిపడేలా చేసింది. ఎవరూ ఎప్పుడూ ఇలాంటి దుర్వాసనను పిల్చి ఉండదు. దాంతోబాటు ఒళ్ళు గగుర్పొడిచేలా ఒక వింతైన 'కులవై' అనే పోలికేక వినిపించింది. అది విన్నవాళ్ళ సర్వాంగ రోమాలు నిక్కబొడుచుకున్నాయి.

అది రాత్రిపూట తిరిగే కాలవీరుడి కులవై కూత కాదు. భవిష్యత్తులో రాబోయే ఏదో పెనుకీడును గురించి చెబుతున్న ఒక సంకేతం. ఈ భూమ్మీద ఎవరో ఎవరికో తీరని అన్యాయం చేశారు. మళ్ళీ అదే వింత కులవై కూత వినిపిస్తోంది. పిల్లలు అదిరిపడి నిద్రలేచి తమ తల్లిదండ్రులను గట్టిగా హత్తుకున్నారు.

కొంతసేపటికెల్లా ఆ దుర్వాసనా, కులవై కూత శబ్దమూ దూరంగా ఎక్కడో వినిపిస్తూ తగ్గిపోయాయి. దుఃఖంతో గొంతు పూడుకుపోయిన జనం ఇంట్లోనే ఉండిపోయి ఒకరినొకరు భయంతో చూసుకున్నారు. ఆ తర్వాత వాళ్ళకి నిద్ర పట్టలేదు. రహస్యంగా ఒకరితో ఒకరు మాట్లాడుకున్నారు.

★★★

ఊరికి దూరంగా ఉన్న దట్టమైన పొదల ప్రదేశంలో పేచ్చి స్థావరం ఏర్పరుచుకుంది. పగటిపూట ఆమె గుడ్లగూబలా బయటకు రాదు. పాము పుట్టలు చుట్టుముట్టిన ఒక తెల్లతుమ్మచెట్టు మీదే ఎండనక వాననక పడుకుని ఉండేది.

అర్ధరాత్రి దాటాక దుర్వాసన కొట్టే ఒక చిన్న ఎముకల గూడును ఎడమ చేత్తో గుండెలకు హత్తుకుని, భయంకరంగా కులవై కూతలు పెడుతూ, కుడి చేతిని గాల్లో వేగంగా ఊపుతూ ఆ గ్రామ వీధుల్లో థఠ్ థఠ్ మని శబ్దం వచ్చేలా మడమలను నేలకేసి తంతూ నడిచి వెళ్ళే పేచ్చిని చూసి ఏం చేయాలో తెలియక ఊరి జనం నిశ్చేష్టులై ఉండిపోయారు.

పగలంతా ఆమె ఎక్కడికి వెళ్తుంది, ఎక్కడ ఉంటుంది అనేది ఎవరికీ అర్థం కాలేదు. స్మశానంలో కాలే శవాల మాంసాన్ని తినడం, అది దొరకని రోజుల్లో పొదల్లోని కలబందను తెంపుకుని తిని బతికేది. ఈ పాడు లోకంలోని మనుషుల సహవాసమే వద్దన్నట్టుగా ఉండేది ఆమె ప్రవర్తన.

హోరు గాలి కాలం పోయి, వానాకాలం, చలికాలం కూడా గడిచి ఎండాకాలం వచ్చింది. ఆ పిచ్చిదానికి భయపడి జనం ఆఱుబయట పడుకుని నిద్రపోవడానికి లేక ఇబ్బంది పడ్డారు.

ఒకరోజు భజన మందిరం ఎదురుగా ఉన్న వేపచెట్ల నీడలో, ఆ ఊరికి చుట్టపు చూపుగా వచ్చిన ఒక యువకుడు అక్కడ నిలిపి ఉంచిన ఒక ఎడ్లబండి చట్రంమీద పడుకుని నిద్రలోకి జారుకున్నాడు.

పున్నమి చంద్రుడు నెమ్మదిగా పడమటి ఆకాశంలో జారుతున్నాడు. వేప మొగ్గలు విచ్చుకుని సువాసన వెదజల్లుతున్నాయి. ఆగ్నేయం నుండి ఉప్పుగాలి హాయిగా వీస్తోంది. నిద్రలో ఉన్న అతనికి పేచ్చి అక్కడికి రావడం కానీ, ఆమె తననే రెప్పవేయకుండా చూస్తూ ఉండటం కానీ తెలియదు. ఆమె చేయి అతని ఒంటిమీదనుండి ముఖం వైపుకు నెమ్మదిగా పాకింది; ఠక్కుమని మేలుకున్నవాడు ఆ చేయిని వెనక్కి తోశాడు. హఠాత్తుగా తన మర్మస్థానాన్ని ఒక చేయి గట్టి పట్టు పట్టుకుని ఉండటంవల్ల కలిగిన నొప్పికి అతను అదిరిపడి లేచాడు. ఎదురుగా పెద్ద కళ్ళతో నవ్వుతూ, బట్టలు లేకుండా నిలబడి ఉన్న స్త్రీని చూసి భీకరంగా కేకలు వేశాడు. భయంతో అతను కళ్ళు తేలవేశాయి.

గ్రామస్తులు పరుగెత్తుకుంటూ వెళ్ళి, బండికి ఉన్న కర్రలు తీసి ఆమెను కొట్టేలోపే, ఆమె తీక్షణమైన స్వరంతో కేకేస్తూ పరుగున మాయమైపోయింది.

★★★

ఒకరోజు అర్ధరాత్రి దాటాక గ్రామస్తులు, పేచ్చి ఊరి వాళ్ళతో కలిసి కర్రలు పట్టుకుని, ఒక అడవి పందిని వేటాడినట్టు తరిమి తరిమి ఆమెను చుట్టుముట్టి, పట్టుకుని వాళ్ళకు అప్పగించారు.

పేచ్చిని వాళ్ళ ఊరికి తీసుకువెళ్ళి కాళ్ళు చేతులు కట్టేసి ఒక మిద్దె ఇంట్లో పెట్టి తాళం వేశారు. ఆ పైన ఆమెకు ఏవేవో వైద్యాలు చేశారు. కానీ ఏం చేసినా ప్రయోజనం లేకపోయింది. ఒకరోజు రాత్రి ఎవరికీ తెలియకుండా గోడకు కన్నం వేసుకుని బయటపడి పారిపోయింది.

మళ్ళీ ఆమె ఈ ఊరికి దూరంగా ఉన్న దట్టమైన పొదల్లోని తెల్లతుమ్మ చెట్టునే ఆశ్రయించింది.

ఆమె కేవలం వెన్నెల రాత్రుల్లో మాత్రమే అక్కడినుండి బయటకు వచ్చేది. వేటాడే జంగుపిల్లిలాగా నక్కుతూ వచ్చేది. మునుపటిలా ఇప్పుడు ఆమె పూనకం వచ్చినదానిలా ఆర్భాటాలు చేయడం లేదు. పార్వతీ దేవి గుడి ముందున్న వేపచెట్టు నీడలో కాసేపు కూర్చుని వెళ్ళిపోయేది. చాలా రోజులుగా నిద్ర లేని కారణంగా ఆ వేపచెట్టు కిందకు రాగానే ఒక రకమైన మైకంతో కూడిన గాఢ నిద్ర కమ్మేసేది ఆమెను. అక్కడే కాసేపు యుద్ధభూమిలో పడి ఉన్న శవంలా కాళ్ళూ చేతులు బార్లా చాపుకుని పడుకుని నిద్రపోయేది.

నిద్రలేవగానే ఆమెకు నవ్వుతున్న తన అందమైన బిడ్డ ముఖం గుర్తొచ్చేది. వెంటనే ఆ వేపచెట్టును కౌగిలించుకుని శబ్దంలేకుండా కుమిలి కుమిలి ఏడ్చేది.

ఆ వేపచెట్టు ఆమెకు ఎటువంటి ఓదార్పునీ ఇవ్వలేని స్థితిలో నిలబడి ఉండేది. తన మొదలును పట్టుకుని దుఃఖంతో వణికిపోతున్న పేచ్చిని చూసి, ఆకాశంలోకి విస్తరించిన తన కొమ్మలను అటు ఇటు ఊపుతూ 'ఉస్' అనే శబ్దాన్ని మాత్రమే చేయగలిగేది. ఆ దుఃఖాన్ని భరించలేక వేపచెట్టు నిట్టూర్పులు విడుస్తునట్టుగా ఉండేది.

భూమ్మీదున్న జీవరాశులన్నీ ఇక ఒక్కొక్కటిగా మేల్కొనబోతున్నాయని చెబుతున్నట్టుగా, తెల్లవారుజామున మొదటి స్వరంగా బూడుకోకిల కూయడం మొదలుపెడుతుంది. ఆ పక్షి కూత వినగానే పేచ్చి ఉలిక్కిపడి లేచి, తన చెట్టు వైపుకు వేగంగా వెళ్ళిపోయేది.

క్రమంగా నిద్రపోవడం మొదలుపెట్టాక, చిత్తంలో మెల్లగా తెలివి వచ్చింది పేచ్చికి. తెలివి వచ్చిన కొద్దీ తన బిడ్డ జ్ఞాపకాలు స్పష్టంగా వచ్చేవి. అందులోనే మునిగిపోయింది. కనీసం కలలోనైనా బిడ్డ కనిపించడా అని తపించిపోయింది. అనుకున్నట్టే ఒకరోజు ఆమె కలలో బిడ్డ వచ్చాడు. గలగలా నవ్వాడు. ఆమెను తాకి ఆడుకున్నాడు. ఆమె పరవశించిపోయింది.

చాలా నెలల తర్వాత ఒకరోజు ఊర్లో పట్టపగలే హఠాత్తుగా జనం వీధుల్లో పరుగులు తీస్తూ, భయంతో తమ ఇళ్ళల్లోకి వెళ్ళిపోయి తలుపులు వేసుకున్నారు. దిగంబరంగా, మళ్ళీ నిండు గర్భిణీలా పెద్ద పొట్టతో, ఆ పిచ్చిది కదులుతున్న స్తనాలతో, మగరాయడిలా చేతులు వేగంగా ఊపుతూ, భూమి అదిరేలా 'థఠ్ థఠ్'మని శబ్దం చేస్తూ ఆ ఊరి నడివీధిలో నడుచుకుంటూ వెళ్తోంది.

★★★

*మూలం: **పేదై** అనే తమిళ కథ, 1966వ సంవత్సరం **శాంతి** పత్రికలో వెలువడింది.*

రచయిత గురించి: https://en.wikipedia.org/wiki/K._Rajanarayanan

COMMENTS